# మానేరుపై అక్రమ వసూళ్ల దందాకు చెక్

- స్పందించిన పెద్దపల్లి కలెక్టర్
- అనధికార టోల్ గేట్ తొలగింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

పెద్దపల్లి/టేకుమట్ల, మార్చి 1 (నమస్తే తెలంగాణ): మానేరు నదిపై అక్రమ వసూళ్ల దందాకు తెరపడింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్– జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి మానేరు నదిలో మట్టి రోడ్డుపై అక్రమంగా టోల్ గేట్ ఏర్పాటు చేసి కొంత కాలంగా సాగుతున్న వసూళ్ల దందాపై 'దర్జాగా దారి దోపిడీ..'అనే శీర్షికన నమస్తే తెలంగాణ మెయిన్‌లో ప్రచురితమైన కథనం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో సంచలనం రేపింది. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఉదయాన్నే ముత్తారం మండలం ఓడేడ్ మానేరు నదీ తీరానికి మంథని సీఐ రాజు గౌడ్, ఆర్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు చేరుకున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వసూలు చేస్తున్న టోల్ గేట్‌ను తొలగించారు. ఇక్కడ ఎలాంటి వసూళ్లకు పాల్పడ వద్దని, ఉచితంగానే రాకపోకలు సాగించేలా చూడాలని నిర్వాహకులను హెచ్చరించారు. అక్రమ టోల్ గేట్‌ను తొలగించడంతో ఆయా గ్రామాల ప్రజలకు వసూళ్ల బెడద తప్పింది. ఉచితంగా రాకపోకలు సాగించేందుకు కృషి చేసిన నమస్తే తెలంగాణకు ఆయా గ్రామాల వారు కృతజ్ఞతలు తెలిపారు.



పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్– జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి మానేరు నదిలో గేట్‌ను తొలగిస్తున్న అధికారులు

నమస్తే ఎఫెక్ట్

# 317 జీవో ఫైల్‌కు మోక్షం

- స్పౌజ్, మెడికల్ క్యాటగిరీలో 87 మందిని బదిలీ చేస్తూ గురుకుల సెక్రటరీ ఉత్తర్వులు
- కొందరికే అవకాశంతో పలువురి ఆగ్రహం

హైదరాబాద్, మార్చి1 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో ఎట్టకేలకు 317 జీవోకు సంబంధించి ఫైల్‌కు మోక్షం లభించింది. 'నమస్తే తెలంగాణ' కథనంతో తుదకు స్పౌజ్, మెడికల్ క్యాటగిరీల్లో 87 మందిని బదిలీ చేశారు. ఈ మేరకు శనివారం సోషల్ వెల్ఫేర్ గురుకుల సెక్రటరీ వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం 317 జీవోలో భాగంగా స్పౌజ్, మెడికల్ క్యాటగిరీల్లో బదిలీలకు వేర్వేరుగా అనుమతులు జారీ చేసింది. ఈ ప్రక్రియను ఫిబ్రవరి 28లోగా పూర్తిచేయాలని ఆదేశాలిచ్చింది. అయితే, తుది గడువు సమీపించినా గురుకుల సొసైటీలో అందుకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇదే విషయమై 'నమస్తే తెలంగాణ' శుక్రవారం ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో సొసైటీ ఉన్నతాధికారులు స్పందించారు. స్పౌజ్ క్యాటగిరీలో 81 మందికి, మెడికల్ గ్రౌండ్‌లో ఆరుగురికి ట్రాన్స్‌ఫర్ అవకాశం కల్పించారు.

**కొంతమందికే అవకాశం..**

317 జీవో కింద కొందరికే అవకాశం కల్పించారని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సొసైటీలో దాదాపు 130 మంది డిస్‌లోకెట్, స్పౌజ్, మెడికల్ క్యాటగిరీల కింద దరఖాస్తు చేసుకోగా, అందులో 87 మందికే అవకాశం ఇచ్చారు. మిగతావి ఎందుకు పెండింగ్ పెట్టారనే విషయాన్ని సొసైటీ వెల్లడించలేదు. దీంతో సదరు ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జీవో మార్గదర్శకాల మేరకు తమకు 100 శాతం అర్హత ఉన్నా బదిలీకి అవకాశం ఇవ్వలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అందరికీ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## సమాజంలో సోషల్ మీడియా పాత్ర కీలకం

### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): సమాజంలో సోషల్ మీడియా పాత్ర కీలకమని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నాంపల్లిలోని మీడియా అకాడమీ కార్యాలయంలో సోషల్ మీడియా జర్నలిస్టుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాల పెంపునకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మాడభూషి శ్రీధర్ సమాచార హక్కు చట్టం గురించి, సీనియర్ జర్నలిస్ట్ కే శ్రీనివాస్ భాషాదోషాల నివారణ, ఉడుముల సుధాకర్‌రెడ్డి డిజిటల్ మీడియాలో వాస్తవాల ధ్రువీకరణ, గోవిందరెడ్డి నేరవార్తల సేకరణ, పాశం యాదగిరి సామాజిక పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, సోషల్ మీడియా ఫోరం రాష్ట్ర కన్వీనర్ కరుణాకర్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాబ్లీ నుంచి నీటి విడుదల

మోర్తాడ్/బాసర, మార్చి 1: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి శనివారం 0.6 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. తాగునీటి అవసరాల కోసం ఏటా మార్చి ఒకటిన గేట్లు ఎత్తి 0.6 టీఎంసీల నీటిని విడుదల చేయాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగానే శనివారం నీటిని వదిలినట్టు అధికారులు తెలిపారు.

## అక్షర చిట్‌ఫండ్ ఏజెంట్ ఆత్మహత్య

### బోర్డు ఎత్తేసిన కంపెనీ



రాజు (ఫైల్)

కరీంనగర్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ శివారులోని మల్కాపూర్‌కు చెందిన చింతల రాజయ్య అలియాస్ రాజు (49) అనే అక్షర చిట్ ఫండ్ ఏజెంట్ ఆత్మహత్య చేసుకున్నా డు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రాజు చిట్స్, ఎల్ఐసీ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. అక్షర చిట్స్‌లో పలువురిని చేర్పించడంతోపాటు తన కు సంబంధించిన రూ.5 లక్షలు, తన సోదరికి సంబంధించిన రూ.5 లక్షలు డిపాజిట్లు చేయించాడు. చిట్స్ కంపెనీ ఇటీవల మూసి వేయడం, పోలీసులు ఆస్తులు సీజ్ చేయడంతో చిట్స్‌లో సభ్యులుగా చేర్పించిన కొందరు డబ్బులు ఇప్పించాలని రాజుపై ఒత్తిడి తెచ్చారు. దీంతో చిట్స్ కంపెనీ నిర్వాహకుల వద్దకు వెళ్లి ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోకపోవడం, ఫోన్లు చేసినా ఎత్తకపోవడంతో తన డబ్బు, సోదరి డబ్బు రాదనే బెంగతో శనివారం తన ఇంటి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజుకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.రాజు కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## 10 జీపీఏ సాధిస్తే విమాన ట్రిప్

రామగిరి, మార్చి 1 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను సొంత ఖర్చుతో విమానంలో బెంగళూరుకు తీసుకెళ్తానని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట జడ్పీహెచ్‌ఎస్ హెచ్ఎం మల్క రాంకిషన్‌రావు వినూత్న కానుకను ప్రకటించారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరీక్షలకు ముందు 20 రోజులపాటు ఉదయం, సాయంత్రం నిర్వహించే ప్రత్యేక తరగతులకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన వారందరికీ విమాన ట్రిప్ వర్తిస్తుందన్నారు.

# కిడ్నీలను దెబ్బతీస్తున్న నిర్లక్ష్యం

- భారీగా పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు
- బీపీ, షుగర్ అదుపులో లేకపోవడమే కారణం
- కిడ్నీ ఫెయిల్ కేసుల్లో 90శాతం మంది వీరే
- స్క్రీనింగ్ తప్పనిసరి: నిమ్స్ వైద్యులు డా. శ్రీభూషణ్‌రాజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 1 (నమస్తే తెలంగాణ): మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో ఈ మధ్య కాలంలో చాలా మంది బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇక వీరిలో చాలామంది బీపీ షుగర్‌ను అదుపులో పెట్టుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుండటంతో కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. పదిహేనేండ్ల నాటి పరిస్థితితో పోలిస్తే ఇప్పుడు దాదాపు ప్రతిరోజు పదుల సంఖ్యలో కిడ్నీ సంబంధిత రోగులు కొత్తగా నమోదవుతున్నారని వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వంశపారంపర్యంగా కొందరు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడుతుండగా, దాదాపు 80 శాతం మంది బీపీ, షుగర్ బాధితులే కావడం గమనార్హం. కిడ్నీలు పూర్తిగా విఫలమైన వారిలో దాదాపు 90 శాతం మంది షుగర్, బీపీ నియంత్రణలో లేనివారే ఉంటున్నారని వైద్యనిపుణులు చెప్తున్నారు. బీపీ, షుగర్ ఉన్నవారు తగిన చికిత్స తీసుకోకపోవడంతో అది కిడ్నీలపై ప్రభావం చూపుతుందని, దీంతో అవి చెడిపోయి గుండెపోటుకు కూడా దారితీస్తుందని నిమ్స్ నెఫ్రాలజీ వైద్యనిపుణులు డాక్టర్ శ్రీభూషణ్‌రాజ్ తెలిపారు.



### ఇవీ జాగ్రత్తలు:

- బీపీ, షుగర్ నియంత్రణలో ఉండేలా జాగ్రత్త పడాలి
- సిస్టోలిక్ బీపీ 130లోపు, డయాస్టొలిక్ బీపీ 85లోపు ఉండే విధంగా చూసుకోవాలి. ఈ మోతాదులు అదుపు తప్పితే వాటికి తగిన మందులు వైద్యుల సలహాల మేరకు వాడాలి.
- సాధ్యమైనంత వరకు ఉప్పు మోతాదును తగ్గించాలి.
- నిల్వచేసిన పచ్చళ్లు, ఊరగాయలకు దూరంగా ఉండాలి.
- పొగ తాగేవారు వెంటనే అది మానేయాలి
- ముఖ్యంగా కిడ్నీవ్యాధితో బాధపడే రోగులు పెయిన్ కిల్లర్ మందులు వాడే ముందు తప్పనిసరిగా నెఫ్రాలజిస్టు సలహా తీసుకోవాలి. లేకుంటే ఆ మందులు కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

**ఏటా రెండు లక్షల మందికి కిడ్నీ వ్యాధి**

ప్రస్తుతం మన దేశంలో సుమారు 32.12 లక్షల మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్టు అంచనా. ప్రతి ఏడాది అదనంగా మరో రెండు లక్షల మంది కిడ్నీ వ్యాధులకు గురవుతున్నారని నిపుణులు తెలుపుతున్నారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఏటా సుమారు 30వేల నుంచి 40వేల మంది కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురవుతున్నట్టు పేర్కొన్నారు. వీరిలో 30 నుంచి 40 శాతం మందికి డయాలసిస్ అవసరమవుతున్నదని తెలిపారు. వారి సమస్యకు మధుమేహం 40 శాతం, హైబీపీ 30 శాతం కారణమని పేర్కొన్నారు. కొంతమందిలో తరచూ కిడ్నీలలో రాళ్లు రావడం వల్ల కూడా కిడ్నీలు పాడవుతున్నాయని తెలిపారు.

**ఐదు దశలో కిడ్నీల వ్యాధి**

కిడ్నీలు దెబ్బతినడానికి ఐదు దశలు ఉంటాయని డాక్టర్ భూషణరాజ్ తెలిపారు. ఇందులో మొదటి, రెండో దశలలో వ్యాధికి సంబంధించి ఎలాంటి లక్షణాలు కనిపించవు. నెమ్మదిగా కిడ్నీల పనితీరు 100 నుంచి 10 శాతానికి పడిపోతుంది. అంటే చివరి 4, 5వ దశకు చేరుకోవటం. ఈ దశలో వ్యాధులు బయటపడడంతో రోగులు దవాఖానకు పరుగులు తీస్తారు. కానీ ఫలితం ఉండదు. అప్పుడు రెండే పరిష్కార మార్గాలు ఉంటాయి. ఒకటి కిడ్నీ మార్పిడి, రెండోది డయాలిసిస్. ఈ విధంగా కిడ్నీలు క్రమంగా పనిచేయకుండా క్షీణించిపోయే దశనే క్రానిక్ డామేజ్ అంటారు.

### స్క్రీనింగ్ తప్పనిసరి: డాక్టర్ శ్రీభూషణ్‌రాజ్



కిడ్నీ వ్యాధి లక్షణాలు ఉన్నవారు, హైబీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగ్గా స్క్రీనింగ్ చేయించుకోవాలి. షుగర్, బీపీ మాత్రమే ఉన్నవారు తప్పనిసరిగా సంవత్సరానికి ఒకసారి కిడ్నీ ఫంక్షనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. ఇక కిడ్నీ సంబంధిత వ్యాధులున్నవారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. ఈ స్క్రీనింగ్ పరీక్షలను మూడు దశలుగా చేస్తారు. అందులో మొదటిది కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్. ఈ పరీక్షలో ప్రొటీన్స్‌గాని, రక్తం గాని నష్టపోతున్నట్టు తేలితే వారిని కిడ్నీ వ్యాధిగ్రస్థులుగా నిర్ధారిస్తారు. రెండోది ఈజీఎఫ్ఆర్ పరీక్ష. అంటే నిమిషానికి 80 నుంచి 100 మిల్లీలీటర్ల నీటిని మూత్రపిండాలు ఫిల్టర్ చేయాలి. అంతకన్న తక్కువ శాతం ఫిల్టర్ చేస్తే వారు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్టు గుర్తించి తదుపరి పరీక్షలు నిర్వహిస్తారు. ఇక మూడోది క్రియాటిన్ పరీక్ష.

## యూరియా కోసం పడిగాపులు



ఖానాపూర్‌లో..

యూరియా అందుబాటులో లేకపోవడంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో రైతులు అవస్థలు పడుతున్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి, బుగ్గారం మండలాల్లోని పీఏసీఎస్ గోదాములకు శనివారం యూరియా లోడ్లు చేరుకోవడంతో ఉదయం నుంచే రైతులు ఆధార్‌కార్డులు, పట్టాపాసు పుస్తకాలు పట్టుకుని క్యూలో నిలబడ్డారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పీఏసీఎస్‌కు యూరియా వచ్చిన్న విషయం తెలుసుకున్న తర్లపాడు, మస్కాపూర్, సుర్జాపూర్, దిలావర్‌పూర్, బాదనకుర్తి, ఎక్బాల్‌పూర్, గోసంపల్లి గ్రామాల రైతులు దాదాపు 150 మంది తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్యూలో నిలబడ్డారు. గంటల తరబడి నిలబడే ఓపిక లేకపోవడంతో చెప్పులు వరసలో పెట్టారు. – ధర్మపురి/ఖానాపూర్

## పేట-కొడంగల్ భూసర్వేను నిలిపివేయాలి



నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు పేరిట దౌర్జన్యంగా చేపడుతున్న భూసర్వేను తక్షణమే నిలిపివేయాలని నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం దంతన్‌పల్లి రైతులు శనివారం తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పరిహారం చెల్లించేందుకు హామీ ఇచ్చిన తర్వాతే సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అఖిలపక్ష నాయకులు మద్దతు తెలిపారు. – ఊట్కూర్(నారాయణపేట)



## రుక్కంపల్లిలో నీటికి కటకట

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం రుక్కంపల్లిలో నీటి ఎద్దడి నెలకొన్నది. గ్రామానికి నీటిని అందించే ప్రధాన ట్యాంక్‌కు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. విద్యుత్తు కోతలు చూపుతూ అధికారులు నీటిని సరఫరా చేయడం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో శివారులోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించి నీటిని తెచ్చుకుంటున్నారు. – నవాబ్‌పేట

# నమ్మించి కిడ్నీ తీసుకున్నారు!

- ఏడాదిన్నర తర్వాత వెలుగులోకి..
- ఉన్న కిడ్నీ చెడిపోయి చావుబతుకుల్లో చిట్టిబాబు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కురవి, మార్చి 1: 'మా నాన్న ధరావత్ చిట్టిబాబుకు మాయ మాటలు చెప్పి అవసరానికి కిడ్నీ తీసుకుని మోసం చేశారు. ప్రస్తుతం ఆయన చావుబతుకుల్లో ఉన్నాడు' అని అతడి కుమార్తె భూక్యా రమాదేవి శనివారం కురవి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు శివారు పొలంపల్లి తండాకు చెందిన ధరావత్ చిట్టిబాబుకు ఇద్దరు కుమారులు నితిన్, రాము, కుమార్తె రమాదేవి ఉన్నారు. భార్య విజయ 3 ఏండ్ల క్రితం మృతిచెందింది. నల్లెల్ల శివారు గాజతండాకు చెందిన ధరావత్ చంద్ర అనే వ్యక్తి సంవత్సరంన్నర క్రితం కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, గాజతండాకు చెందిన ధరావత్ సురేశ్, బానోత్ నవీన్‌తో కలిసి పొలంపల్లి తండాకు చెందిన ధరావత్ రవి వద్దకు వచ్చారు. నలుగురు కలిసి ధరావత్ చిట్టిబాబు ఇంటికి వెళ్లి కిడ్నీ ఇస్తే రెండు ఎకరాల భూమి, రెండు గుంటల స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని, భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా చూసుకుంటామని చెప్పి ఒప్పించారు. కుటుంబసభ్యుల సమక్షంలో అగ్రిమెంటు రాసి, చిట్టిబాబును హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి కిడ్నీ తీయించి, చంద్రకు అమర్చారు. ప్రస్తుతం చిట్టిబాబుకు ఉన్న ఒక్క కిడ్నీ చెడిపోయింది. ఆరోగ్యం బాగాలేదని, నాడు హామీ ఇచ్చిన వారి వద్దకు వెళ్లి అడిగితే తమకేం సంబంధం లేదని, దిక్కున్నచోట చెప్పుకోమన్నారు. తన తండ్రి అనారోగ్యంతో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని, మోసం చేసిన చంద్ర, రవి, సురేశ్, నవీన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రమాదేవి ఫిర్యాదులో పేర్కొన్నది.

# నేడు యూపీఎస్‌పై యుద్ధభేరి

- ఇందిరా పార్కు వద్ద సీపీఎస్ఈయూ ధర్నా
- ఉద్యోగులంతా తరలిరావాలని పిలుపు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)కు వ్యతిరేకంగా ఆదివారం హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నారు. 'యూపీఎస్‌పై యుద్ధభేరి' పేరుతో ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ఈ ధర్నాకు రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా తరలిరావాలని తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (సీపీఎస్ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సీపీఎస్ఈయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. యూపీఎస్‌ను ఆమోదిస్తూ జనవరి 24న కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీచేసిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితమని చెప్పిన ఈ స్కీంను అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేందుకు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) చర్చలు జరుపుతోందని ఆరోపించారు. 2004లో సీపీఎస్‌ను అమలు చేసినప్పుడు పీఎఫ్ఆర్‌డీఏ మార్కెట్ ఏజెన్సీగా వ్యవహరించి ఉద్యోగుల భవిష్యనిధిని షేర్ మార్కెట్‌పాలు చేసిందని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్ర ఆర్థికశాఖ లోపభూయిష్టంగా యూపీఎస్‌ను రూపొందించిందని, ఈ స్కీంతో రాష్ట్రాలపై అధిక పెన్షన్ భారం పడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎస్ఈయూ రాష్ట్ర కోశాధికారి నరేశ్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు పాల్గొన్నారు.

# విద్యుత్తు డిమాండ్ 17,500 మెగావాట్లు

- మార్చి నెలలో గరిష్ఠస్థాయికి పెరిగే అవకాశం
- యాసంగి కోతలయ్యాక తగ్గనున్న డిమాండ్
- డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా: ట్రాన్స్‌కో



హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): మార్చి నెలలో విద్యుత్తు డిమాండ్ 17,500 మెగావాట్ల గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉన్నదని టీజీ ట్రాన్స్‌కో అంచనా వేసింది. ఈ డిమాండ్ నేపథ్యంలో విద్యుత్తు సంస్థలు అన్నిరకాల ఏర్పాట్లు చేశాయని సంస్థ పేర్కొన్నది. వేసవి డిమాండ్ దృష్ట్యా అదనపు సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ల పెంపును చేపట్టామని, ఈ పనులు మార్చి 10 కల్లా పూర్తవుతాయని, విద్యుత్తు కోతలు ఉండబోవని సంస్థ వెల్లడించింది. గరిష్ఠ డిమాండ్ మేరకు విద్యుత్తు సరఫరా చేసేందుకు విద్యుత్తు సంస్థలు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నది. విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 2022–23లో 15,497 మెగావాట్లు, 2023–24లో 15,623, 2024–25లో 16,601 మెగావాట్లుగా నమోదైనట్టు సంస్థ తెలిపింది. గతంలో బయటి రాష్ట్రాల నుంచి విద్యుత్తు పొందేందుకు పీపీఏలు కుదుర్చుకున్నామని, ఈ మేరకు ఎన్టీపీసీ, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్, సోలార్ విద్యుత్తును తీసుకుంటున్నట్టు తెలిపింది. రాష్ట్రంలో ఏటా గరిష్ట డిమాండ్ మార్చిలో నమోదవుతుందని, ఏప్రిల్ నుంచి రబీ పంట కోతలతో ఈ డిమాండ్ తగ్గుతుందని సంస్థ అంచనా వేసింది. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్–2లో గత సెప్టెంబర్ నుంచి ఉత్పత్తి ప్రారంభం కాగా, నవంబర్ నుంచి యూనిట్–1లో ఉత్పత్తి ప్రారంభించామని, మిగతా మూడు యూనిట్లను జూన్ నాటికి అందుబాటులోకి తెస్తామని సంస్థ తెలిపింది.

# ఎప్‌సెట్‌లో ఏపీ సెంటర్లు ఔట్

- ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- తొలిరోజు 5,010 దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఎప్‌సెట్‌కు ఏపీలో ఏర్పాటు చేయాలనుకున్న సెంటర్లను అధికారులు తొలగించారు. ఎప్‌సెట్‌లో ఏపీ కోటా సీట్లను నిలిపివేయడంతో సెంటర్ల రద్దు నిర్ణయం తీసుకున్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో 100 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులకే రిజర్వుచేస్తూ జీవో జారీ చేశారు. ఎప్‌సెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యింది. తొలిరోజు మొత్తం 5,010 మంది దరఖాస్తులు సమర్పించారు. వీరిలో ఇంజినీరింగ్‌కు 3,116 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 1,891 మంది, రెండు పరీక్షలకు హాజరయ్యేందుకు ముగ్గురు చొప్పున విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్ తెలిపారు. ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందని వెల్లడించారు.

## లాసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం ఆలస్యంగా ప్రారంభమయ్యింది. సాయంత్రం 4గంటల తర్వాత దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం శనివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకావాల్సి ఉండగా, ఉదయం నుంచే అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పలేదు. ఎట్టకేలకు సాయంత్రం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. తొలిరోజు కేవలం 30 మంది మాత్రమే దరఖాస్తులు సమర్పించారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

## ఆన్‌లైన్ రమ్మీకి యువకుడి బలి

ఖైరతాబాద్, మార్చి 1 : ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, ఏపీలోని శ్రీశైలంకు చెందిన సత్యనారాయణ–సత్యవతి కుమారుడు నూకరాజు (27 ) బీటెక్ చేశాడు. ఆన్‌లైన్ రమ్మీకి అలవాటుపడి అప్పులు చేయగా తల్లిదండ్రులు తీర్చివేశారు. ఉద్యోగాన్వేషణలో నగరానికి వచ్చి, మణికంఠతో కలిసి అమీర్‌పేటలోని లాడ్జిలో ఉంటున్నాడు. ఇంటర్వ్యూలకు హాజరుకాగా ఉద్యోగం రాలేదు. ఊళ్లో ఉండలేక, ఉద్యోగంరాక మనస్తాపంతో శనివారం గదిలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖానాకు తరలించారు.

# 15 నిమిషాల ముందే గేట్లు క్లోజ్

- 8:45 గంటల వరకే ఎంట్రీ
- ఆ తర్వాత వస్తే పరీక్షరాసే చాన్స్ కోల్పోయినట్టే
- సంచలన నిర్ణయం తీసుకున్న ఇంటర్‌బోర్డు
- ఇది వరకు ఒక నిమిషం లేట్ నిబంధన అమలు
- ఈ నెల 5 నుంచి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు



హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా తెలంగాణ ఇంటర్‌బోర్డు సంచలన నిర్ణయం తీసుకున్నది. పరీక్షా సమయానికి 15 నిమిషాల ముందే సెంటర్ల గేట్లు క్లోజ్ చేయాలని నిర్ణయించింది. ఉదయం 8:45 గంటలలోపు వచ్చిన వారినే పరీక్షకు అనుమతించనున్నది. ఆ తర్వాత వస్తే ఎట్టి పరిస్థితుల్లో అనుమతించొద్దని నిర్ణయించింది. విద్యార్థులు ఉదయం 8:30గంటలకల్లా పరీక్షాహాల్లో ఉండాలన్న నిబంధనను బోర్డు తొలిసారిగా అమల్లోకి తీసుకొచ్చింది. ఇలా పరీక్ష ముందే గేట్లు క్లోజ్ చేయడం ఇదే తొలిసారి. ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేయగా.. 9,96,541 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఫస్టియర్ వారు 4,88,316 ఉండగా, 5,08,225 మంది సెకండియర్ విద్యార్థులున్నారు. ఏవైనా సందేహాలుంటే 92402 05555 టోల్ ఫ్రీ నంబర్‌తోపాటు, జిల్లా కంట్రోల్ రూం ఇన్‌చార్జి నంబర్లను సంప్రదించవచ్చు.

**నిమిషం నిబంధన మరిచిపోవాల్సిందే..**

ఇంటర్ పరీక్షల్లో నిమిషం లేట్‌గా వచ్చిన వారికి నో ఎంట్రీ నిబంధన చాలా కాలంగా అమలవుతున్నది. ఈ నిబంధన కారణంగా పరీక్షకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులెందరో త్రుటిలో అవకాశం చేజార్చుకున్నారు. 2024 మార్చి వార్షిక పరీక్షలప్పుడు తొలిరోజే ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ విద్యార్థి సెంటర్‌కు ఆలస్యంగా చేరుకోవడం, సదరు విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడటం అప్పట్లో సంచలనం సృష్టించింది. తేరుకున్న సర్కారు నిమిషం నిబంధనను సడలించి, ఐదు నిమిషాల వరకు మినహాయింపు ఇచ్చింది. ఆ తర్వాతి పరీక్షల్లో ఐదు నిమిషాలు లేట్‌గా వచ్చిన విద్యార్థులను పరీక్షకు అనుమతి ఇచ్చారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ సమయంలోనూ ఐదు నిమిషాలు లేట్ నిబంధన అమలయ్యింది. కానిప్పుడు 15 నిమిషాల ముందే గేట్లు క్లోజ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో ఒక నిమిషం లేట్ ఎంట్రీ నిబంధన కాలగర్భంలో కలిసిపోయినట్లయ్యింది.